## షో

"ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీ నానాటికీ స్వాతంత్ర్యాన్ని కోల్పోతోంది!"

"ఊ..."

"బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడంటూ స్త్రీలను బలహీన మనస్కులను చేసి మగాడిపై ఎప్పటికీ ఆధారపడేలా చేసిందీ సంఘం"

"నిజమే"

"స్త్రీలను వంటింటి కుందేలుగానో లేక పడకింటి సుఖం నిచ్చే మరబొమ్మలాగో మగాడు చూస్తున్నాడు"

"అలాగా"

"అక్షరజ్ఞానం లేనివాడు కూడా లక్షల కట్నం అడుగుతుంటే స్త్రీ నోరు మూసుక్కూర్చోవల్సిందేనా?"

"అబ్బెబ్బే..."

"ఆడది అబల కాదని ఆదిశక్తి స్వరూపిణి అని, ఈ దురహంకార పురుష లోకానికి తెలియజెప్పాలి!"

"అబ్బా!"

"ఎన్ని తప్పులు చేసినా మొగుడ్ని దేవుడిగానే చూడాలనే పురాణాల పతివ్రతా కథల్ని నేలమట్టం చేయాలి."

"అవును"

"ఈ సమాజంలో స్త్రీ స్వతంత్రంగా బ్రతకగలదని నిరూపించాలి. అప్పుడుగాని ఈ మగ లోకానికి బుద్ధి రాదు."

"మీ మాటల ద్వారా మాలో ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కల్గించారు. ఇంతకీ మీ పేరంటమ్మా?"

"నా పేరు లక్ష్మీత్రివాథన్"

— రాజశేఖర్

## ఎవరితో

'ఇది చాలా చిన్ని ఆపరేషన్. చాలా ఈజీగా చేసేయవచ్చు..మీరేం భయపడకండి అంటున్నార్రా హాస్పిటల్‌లోని వాళ్లందరూ'

'భయమెందుకు మరి చేయించుకో'

'అలా అని నాతో కాదురా నాకు ఆపరేషన్ చేసే డాక్టరుతో అంటున్నారు.'

—కె.వి.మధుసూదనరావు, కాకినాడ.

పీటల మీద దంపతులు కూర్చున్నప్పుడు భార్యను ఎటువైపు కూర్చోపెట్టాలిరా సుబ్బన్నా."

వీరన్న గారి మాటలు ఆ మండువాలో ఖంగున మోగాయి. ఆయన మాటలకి సుబ్బన్న ఖంగుతిని బేల చూపులు చూశాడు. మండువాలో కూర్చున్న జనమంతా వెనక్కి తిరిగి గుమ్మంలో నుంచున్న వీరన్న గారి కేసి చూశారు.

"మాయదారి సుబ్బన్నకి కుడి ఎడమ తెలియదు. నువ్వటు కూసో" అన్నాడు పీటల మీద కూర్చున్న యజమాని భార్యతో. ఆమె భర్తకి ఎడం వైపుకి వెళ్లి కూర్చుంది.

సుబ్బన్న తను కూర్చున్న పీట ఖాళీ చేసి పక్కనే నేల మీద చతికిలబడి వీరన్నగారి కేసి భయం భయంగా చూస్తున్నాడు.

"మా రోజుల్లో నమకం, చమకం, ఉపనయనం, వివాహం—అన్నీ కళ్ళు మూసుకుని వప్పచెప్పే తాహతు ఉంటేగాని పీట ఎక్కేవాళ్ళం కాదు. అలాంటిది ఈ రోజుల్లో తూర్పేదో, పడమరేదో తెలియని కుంకలు కూడా పసుపు పళ్లెంలో చెయ్యి పెట్టడానికి సాహసిస్తున్నారు. కాలం —కలికాలం. అందుకే బ్రాహ్మణ్యానికి విలువ లేకుండా పోయింది."

సుబ్బన్న ఖాళీ చేసిన పీట మీద చతికిలబడుతూ వీరన్నగారన్న మాటలు అక్కడ చేరిన వాళ్ళంతా ఆయన చెప్పిన దాంట్లో ఆవగింజంత కూడా అబద్ధం లేదన్నట్టుగా తలూపారు.

అవును! సుబ్బన్న మొహం ఆవగింజంత అయిపోయింది. అక్కడ జరుగుతున్నది సత్యనారాయణ వ్రతం. అది సుబ్బన్న ఆశ్రమం. అతనికి వ్రతం చేయించడం చాతకాదు. అందుకే ముందు రోజు వీరన్న గారి దగ్గరికి వెళ్ళి 'మీ రొచ్చి కాస్త మాట దక్కించాలి' అని ప్రాధేయపడ్డాడు.

'ముందు నాకు కుదరదురా!' అన్నాడు.

తర్వాత ఏమిస్తావ్ అనడిగాడు.

మరి కొంత సేపు బతిమాలాక 'సరే — వస్తాను. కాని సుబ్బారావు తండ్రి ఆబ్దికం ఉంది. కాళ్ళు కడిగి పెట్టేస్తానన్నాడులే — నేనెడితే ఓ ఇరనైరాలుస్తాడు. అది పూర్తి చేసుకుని వస్తాను. నే వచ్చేలోగా దంపతుల్ని పీటల మీద కూర్చోబెట్టి విఘ్నేశ్వర పూజ కానిస్తూ ఉండు" అన్నాడు.

సుబ్బన్న చాలా సంతోషపడ్డాడు.

వీరన్న గారు చెప్పినట్టే ఉదయమే వ్రతం చేసుకునే యజమాని ఇంటికి వెళ్లి పూజా సామగ్రి అంతా సర్ది విఘ్నేశ్వరా పూజ మొదలు పెట్టించాడు.

'శ్రీ మహా గణపతయే నమః వస్త్ర యుగ్మం సమర్పయామి'



అంటున్నాడో లేదో—వీరన్న గారు రావడం, తన తప్పు పట్టుకోవడం, తన సిగ్గు వస్త్రం విప్పెయ్యడం జరిగిపోయింది.

సుబ్బన్న దొరికిపోయాడు.

తిమింగలానికి చేప పిల్ల దొరికి పోయినట్టు ఘోరంగా దొరికిపోయాడు.

'ఛీ శనిరోజులు' అని మనసులో పదే పదే అను కుంటున్నాడు.


* * *

ఆ ఊరు బావుంటుంది.

పక్కనే పారుతున్న పంట కాలువ, ఊరి మధ్యలో మంచినీళ్ళ చెరువు. శివకేశవుల ఆలయాలు. చిన్న హైస్కూలు, ఓ లైబ్రరీ, ఓ హాస్పిటలూ—

గాంధీగారు కలలుగన్న గ్రామ రాజ్యం వెల్లి విరుస్తున్నట్టుగా ఉంటుంది. ఆ ఊరి జనం చాలా భాగం వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతారు. పంట చేతికి వచ్చే సమయానికి తుఫానుల్లాంటి బీభత్సాలు లేక పోతే అక్కడ బంగారం పండుతుంది.

ఆ ఊళ్ళో పంచ కులాల వారు గొడవల్లేకుండా



# శనిగాడు

## వీరభద్రరావు పమ్మి

సామరస్యంగా కాలక్షేపం చేస్తారు. వాళ్ళందరికీ భక్తి ఎక్కువ. డబ్బున్న వాళ్ళు చాలా మందే ఉన్నారు. వాళ్ళంతా పూజాది కార్యక్రమాల పట్ల, భజనల పట్ల శ్రద్ధ చూపిస్తారు.

ఆ ఊళ్ళో చాలా ఇళ్ళకి వీరన్న గారు పురోహితుడు. ఆయన మంచి డొక్క శుద్ధి ఉన్నవాడు. ముహూర్త నిర్ణయంలో గట్టి వాడని మంచి పేరుంది.

ఆయనకా ఊళ్ళో రాబడి బావుంటుంది. ముగ్గురు కూతుళ్ళకి ఘనంగా పెళ్ళిళ్ళు చెయ్యడమేకాకుండా అయిదెకరాల భూమి కొన్నాడు. ఒంకంత కొంప ఉంది. ఓ కుర్రాడు స్మార్తం చెప్పకుంటున్నాడు. మరో పిల్లాడు హైస్కూల్లో చదువుకుంటున్నాడు.

'నాకేం లోటు' అని గుండెమీద చెయ్యి వేసుకుని నిబ్బరంగా బతక గలిగిన మనిషి...

కాని—

ఈ మధ్యన—ఆయన కేదో బెంగ పట్టుకుంది.

బుగులు పుట్టుకొచ్చింది. అదీ —వెంకటరత్నం చని పోయినప్పట్నుంచీ!

వెంకటరత్నం కూడా అదే ఊళ్ళో పౌరోహిత్యాలు చేయించి బతికేవాడు. అతనికున్న ఆశ్రయాలు తక్కువ. ఉన్న వాటిలో సగం పైగా బక్క కుటుం బాలు. అతని రాబడి అతని కుటుంబానికి సరిపోయేది కాదు. అంతలో పాపం క్షయ వ్యాధి వచ్చి, పీడించి, అప్పులు చేయించి ఇంకాస్త దరిద్రుణ్ణి చేసి కూడా తీసుకుపోయింది.

కుటుంబ బాధ్యతంతా వెంకటరత్నం తలకి కొరివి పెట్టిన పెద్ద కొడుకు సుబ్బన్న మీద పడింది. తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు, తను బతకాలి. కొడుక్కి స్మార్తం చెప్పాలని వెంకటరత్నం తెగ తాపత్రయ పడేవాడు—కాని ఎంత ప్రయత్నించినా సుబ్బన్నకి ముక్కలు రాలేదు.

విఘ్నేశ్వరపూజ అంతంత మాత్రంగా చేయించ గలడు... అంతే! అంతకు మించి ఏదీ నడవదు.

పుణ్యాహవాచనం, ఉపనయనం, వివాహం లాంటి పెద్ద కార్యక్రమాలు ఉంటే అతను ఖచ్చితంగా వీరన్న గారి మీద ఆధారపడాలి. ఆ ఊళ్ళో పెద్ద కార్యక్రమాలు జరిపించగలిగిన వాడు ఆయనొక్కడే! అలా —వీరన్న గార్ని పిలుచుకొచ్చినప్పుడు సుబ్బన్న యజమాని తన కిచ్చిన రొఖంలో కొంత ఆయనకి ముట్టజెపుతాడు. మిగిలిన డబ్బు, బియ్యం తదితర సరుకులు తన ఇంటికి తీసికెడతాడు.


అసలేమీ లేని దానికన్నా కొంత నయం కదా! అని సుబ్బన్న తృప్తి పడతాడు. కాని వీరన్న గారి ధోరణి అతనికి అర్థం కాకుండా ఉంది.

తన ఆశ్రయంలో ఏదైనా పని బడినప్పుడు రమ్మంటే ఓ పట్టాన ఒప్పుకోడు. సాగదీసి, నసబెట్టి చివరికి వస్తానంటాడు. వచ్చి ఊరికే ఉండడు. తన యజమాని ముందు ఏదో ఒంకబెట్టి తనని అవ మానిస్తాడు. చిన్న చూపు చూస్తాడు. తనకి ముక్కలు రావన్న విషయం పదే పదే చెప్పి తన యజమానికి తన మీద ఏహ్య భావం కలిగేటట్టుగా ప్రవర్తిస్తాడు.

అంతకీ సుబ్బన్న ఆయన చెప్పినట్టల్లా విని, ఆయన్ని గౌరవిస్తూ, ఆయనకి భయపడుతూ జాగ్రత్తగానే కాలక్షేపం చేస్తున్నాడు.

వీరన్న గారి మనసులో ఆంతర్యం ఏమిటో సుబ్బ న్నకి అంతుబట్టదు. రోజులు దొర్లుతూనే ఉన్నాయి. రాను రాను సుబ్బన్న చేసిన తప్పుల్ని వీరన్నగారు ఎత్తి చూపడం ఎక్కువై పోయింది.

ఓ సారి ఓ వివాహంలో వీరన్నగారు పీట మీద కూర్చుని తంతు జరిపిస్తూ ఓ పంచెల చాపు సుబ్బన్న కిచ్చి దాన్ని రెండుగా చింపమన్నారు. అది పెళ్ళి కుమార్తె తండ్రి పెళ్ళి కొడుక్కి పెట్టాల్సినది. సుబ్బన్న దాన్ని చింపడం మొదలెట్టాడు. ఎంతకీ తెమలడం



లేదు. జాగ్రత్తగా తేరిపార చూశాడు. విషయం అర్థమైంది. అతను పంచెల చాపుని అడ్డంగా చింపుతున్నాడు. అతనికి డొక్కల్లోంచి భయం పుట్టుకొచ్చింది. విషయం వీరన్న గారికి చెప్పాడు. ఆయన ఏదో మంత్రం వేసి కడుపులో పెట్టుకుని కాపాడతాడని ఆశించాడు.

అతనికి నిరాశ మిగిలింది.

వీరన్నగారు అతని చేతిలోంచి చాపు ముక్కని ఎత్తి అందరికీ చూపుతూ గేలి చేసి, హేళన చేసి యజమానితో "ఇలాంటి వాడా మీ పురోహితుడు—అదృష్టవంతులు" అన్నాడు.

అంతే!

మర్నాడు ఆ యజమాని సుబ్బన్నని పిల్చి "మీకు ముక్కలు రావు. ఏవీ తెలియదు. వేరే పనేదైనా చేసుకోండి. మా పౌరోహిత్యం వీరన్నగారికిచ్చేశాం" అన్నాడు.

కడుపులో పెట్టుకుని కాపాడతాడనుకున్న వీరన్నగారు కడుపు మీద కొట్టాడు.

అలా ఒకటి, రెండు, మూడు.

కడుపు మీద చాలా సార్లు కొట్టాడు. సుబ్బన్న పౌరోహిత్యాలన్నీ వరుసగా వీరన్నగారికి వెళ్ళిపోయాయి.

మిగిలిన వన్నీ బక్క కుటుంబాలు.

రాను రాను సుబ్బన్నకి ఆ ఊళ్ళో బతకడం కష్టమైపోయింది. చాలా కష్టమైపోయింది. మరేదైనా పని చేసుకుని బతకడానికి ఆ పల్లెటూళ్ళో పనేం దొరుకుతుంది?

'ఇక ఈ ఊళ్ళో బతకడం నావల్ల కాదు' అనుకున్నాక అతను అక్కడికి పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న పట్నానికి మకాం మార్చాడు. అతను చదివిన ఏడో తరగతి చదువుకి ఉద్యోగం ఇస్తామని ఎవరూ ముందుకి రాలేదు. మినీ పురోహిత్యం మీద బతుకుదామంటే అతనికి ముక్కలు రావు. తను, తల్లి, తమ్ముళ్ళ పస్తుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అప్పుడే అతనికి పట్నంలో వెంకటశాస్త్రి పరిచయం అయ్యాడు. పట్నంలో బతకడం ఎంత కష్టమో చెప్పాడు. ఎలా బతకొచ్చో తెలియజెప్పాడు.

సుబ్బన్నకి ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. వెంకటశాస్త్రి చెప్పిన విషయం ఒకటికి పదిసార్లు ఆలోచించాడు. తెల్లారేసరికి ఓ నిర్ణయానికి వచ్చి — వెంటనే వెంకటశాస్త్రి ఇంటి కెళ్ళి తన అంగీకారం తెలియజేశాడు.

**ఎవరు?**

ఇద్దరు వ్యక్తుల మధ్య ఆధ్యాత్మిక చర్చ జోరుగా సాగుతోంది. 'ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఏదో ఓ రోజు చావాల్సిందే! ఒకరు ముందు, ఒకరు తర్వాత అంతే భేదం' అన్నాడు గంభీరంగా.

రెండవ వ్యక్తి: 'అయితే చివర చనిపోయే వ్యక్తి శవాన్ని తరలించే దెవరు?' అన్నాడు విచారంగా

—మురళి, హైదరాబాద్.

రెండు రోజులు గడిచాక వెంకట శాస్త్రి రమ్మన్న చోటుకి వెళ్ళాడు. ఆ ఇంటి యజమానికి కొడుకు పుట్టాడు. మూల నక్షత్రంలో పుట్టిన కారణంగా గుండాల శాంతి చేయిస్తున్నారు.

సుబ్బన్న ఆ ఇంటి అరుగుమీద కూర్చున్నాడు. "రారా సుబ్బన్నా!" వెంకటశాస్త్రి గట్టిగా పిల్చాడు. సుబ్బన్న హాల్లోకి వెళ్ళి ఓ పీట మీద కూర్చున్నాడు. పళ్ళెంలో కాళ్ళు పెట్టాడు. యజమానురాలు పోసిన నీళ్ళతో యజమాని సుబ్బన్న కాళ్ళు కడిగాడు.

చిటికెడు నువ్వులు వేళ్ళమీదకి తీసుకుని నీళ్ళు ఒంచుతూ సుబ్బన్న చేతిలో వదిలి పెట్టాడు. యజమాని తనకంటిన సవా లక్ష దరిద్రాలు వదిలి


# తపాల్ మూలముగా చిత్రకళ!



బొమ్మలు చిత్రించుటకును
వర్ణ చిత్రములు చిత్రించు కళను అభ్యసింపవలెనా
28 సం॥లుగా మీ అభిమానానికి, శక్తి చాతుర్యానికి
పేరు ప్రసిద్ధి చెందిన "చందును విద్యాలయ"

నుండి తపాల్ మూలముగా తమిళము, ఇంగ్లీషు, మలయాళము, తెలుగు, హిందీ భాషలలో యింటి నుండే మీరు చిత్రములు వేయు సామర్థ్యం, నేర్పు చక్కగా అభ్యసించగలరు.

వివరములకు 90 పైసల స్టాంపుతోపాటు అప్లికేషన్ పంపవలసినది.

విలాసం : చందును చిత్ర విద్యాలయ
C/o చిత్రకళను (AJ)
179 సింగన్న వీధి, చింతాద్రిపేట, మద్రాసు-2.



# పెండ్లికి ముందు, పెండ్లి తరువాత



అన్నిరకములైన వ్యాధులను ఇంకా నపుంసకత్వాన్ని, హస్త ప్రయోగమువలన నరాల బలహీనతకు, స్వప్న మందు వీర్యస్కలనము వలన బలహీనతకు (V D) గనేరియా, సిఫిలిస్, ఇంకా సంతానములేనివారు సంతానమును కలిగించుకొండి. ఈ వ్యాధులకు సుమారు ఎన్నో సంవత్సరములు అనుభవముగల డాక్టరు ఎం. హెచ్. మల్లిక్ (Govt. Regd) గారితో చికిత్స పొందవలెను. వీరి చికిత్స నుంచి వేలాది ప్రజలు రోగముల నుంచి సుఖపడినారు.

సూచనము: మీరు ఏ రోగము వున్నా పర స్థలమునుంచైనా పోస్టుద్వారా పత్రము వ్యవహరించుకొని మందులు పోస్టు పార్సిల్ ద్వారా తెప్పించుకొని ఉపయోగించుకొనవచ్చును. మీరు మీ దాంపత్య సుఖమును పొందండి.

*సంప్రతించు వేళలు: ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 8 గం. వరకు.*
*ఆదివారం కూడా పనిచేయును.*

## మల్లిక్ డిస్పెన్సరి

34/2, శ్రీ హరిరాం కాంప్లెక్స్, సాగర థియేటర్ ప్రక్కన
కెంపేగౌడ రోడ్డు బెంగుళూరు- 560 009

### నేనే

'హఠాత్తుగా మీకు బిర్లా కున్నంత ఆస్తి కలిసొస్తే ఎవరు ఎక్కువ ధనవంతులవుతారు?' అడిగాడు గోపాలం భూపాలాన్ని.

'నేనే!' స్థిరంగా చెప్పాడు భూపాలం.

'ఎలా?'

'నాకున్న ఈ కిళ్లీ కొట్టు బిర్లాకి లేదుగా. నా స్థిరాస్తి కూడా అందులో కలుపుకుంటే నేనే కదా...'

—టి.నీలిమ.

పోయినట్టుగా తృప్తిగా చూశాడు.

తన చేతిలోకి వచ్చిన నువ్వుల్ని పళ్ళెంలోకి వంచుతున్నప్పుడు సుబ్బన్న చెయ్యి వణికింది. అతని గుండె వణికింది. అతని నోరు ఎండిపోయింది. అతనికి ప్రపంచ మంతా నువ్వుల్తో నిండి పోయినట్టు కనిపిస్తోంది. నూనె ధారాపాతంగా కురుస్తున్నట్టు, నల్ల గుడ్డతో తన నెవరో కప్పేస్తున్నట్టు, చీమలు బారులు బారులుగా తన చుట్టూ వలయాకారంలో తిరుగుతున్నట్టు, శనిగాడు తనని చూసి వికటంగా నవ్వుతూ తనని కౌగలించుకునేందుకు ముందుకు వస్తున్నట్టు తనకి కప్పిన నల్ల గుడ్డ నీడలోకి తల్లీ, తమ్ముళ్ళు వచ్చి చేరుతున్నట్టు — అనిపిస్తోంది.

అతనికి భయం వేసింది.

అతనికి వీరన్నగారు జ్ఞాపకం వచ్చారు. సప్తకల్ల సవారీ జ్ఞాపకం వచ్చింది. బీడు పట్టిన భూమిలా పగిలి పోయిన తన శరీరం కళ్ళ ముందు కదిలింది. అతనికి బియ్యం జ్ఞాపకం వచ్చాయి. బియ్యం ఉడకగా, ఉడకగా ఒళ్ళు విరుచుకున్న అన్నం జ్ఞాపకం వచ్చింది. ఆకలి జ్ఞాపకం వచ్చింది. ఆకలితో కదిలే పేగు జ్ఞాపకం వచ్చింది.

అంతలోనే అతనికి ధైర్యం కలిగింది.

'అవును—పట్టెడు అన్నం కోసం నాకు, అమ్మకి, తమ్ముళ్ళకి కడుపునింపే ఇంత అన్నం కోసం ఈ నువ్వులగానుగలో తలపెడుతున్నాను. ఈ నూనె గుడ్డని వంటి చుట్టూ కప్పుకుంటున్నాను. తెల్లని అన్నం కోసం నల్లటి నువ్వుల్ని నమ్ముకుంటున్నాను—

ఓ శనీశ్వరా! ఏం చేసినా నీదే భారం. నిన్నే నమ్ముకున్నాను— అనుకున్నాడు.

'శమగ్ని రగ్ని భిఃస్కర
వృన్న స్తపతు సూర్యేః
శంవాతో వాత్వర పా
అప్రశితః ' — అని శనికి స్తోత్రం

చేసాడు.

తన కిచ్చిన బియ్యాన్ని తువ్వాల్లో మూట గట్టుకుని, వెంకటశాస్త్రి ఇప్పించిన ఇరవై అయిదు రూపాయలకేసి తృప్తిగా చూశాడు.

"ఆ మూట తీసుకుని వెనక్కి చూడకుండా వెళ్ళి పోరా సుబ్బన్నా" అన్నాడు వెంకటశాస్త్రి.

సుబ్బన్న సైకిలెక్కి వాయువేగంతో ఇంటికి వెళ్ళిపోయాడు.

సుబ్బన్న తిలదానాలు పడతున్నందుకు తల్లి ముందు కోప్పడింది. తర్వాత బాధ పడింది. చివర్న "నువ్వు మాత్రం ఏం చేస్తావ్? ఆ మహానుభావుడు కొండంత భారాన్ని నీ నెత్తిమీద పెట్టి వెళ్ళాడు. నా బాధల్లా తిలదానాలు పట్టేవాడికి ఎవరూ పిల్ల నివ్వరు" అంది.

"ఆ —మరో తిలదానాలు పట్టే వాడిస్తాడు లేవే!" అని పకపక నవ్వాడు సుబ్బన్న.

రోజులు నడుస్తున్నాయి.

దేశంలో నాస్తికులు ఎంతలా పెరుగుతున్నారో అంతకు రెట్టింపు ఆస్తికులూ పెరుగుతున్నారు.

సుబ్బన్నకి కొత్త వృత్తి బాగానే వుంది.

అతను ఉంటున్న ఊళ్ళో అతను గాక మరిద్దరు తిలదానాలు పట్టేవాళ్ళున్నారు. అందులో ఒకాయన వృద్ధాప్యంతో చనిపోయాడు. ఇహ ఇద్దరే మిగిలారు.

సుబ్బన్న మెల్లిమెల్లిగా పెంచేసాడు. అతని వృత్తి మీద వచ్చే రాబడి అతని కుటుంబానికి సరిపోతోంది. అన్న వస్త్రాలకి లోటు లేకుండా గడిచిపోతోంది.

బ్రాహ్మణ్యంలో నీచంగా చూడబడేవి మూడు వృత్తులు. ఒకటి తిలదానాలు పట్టడం, రెండు అపర కర్మలు చేయించడం, మూడోది శవ వాహకత్వం. మరీ అన్నానికి లోటు వుంటే కాని సాధారణంగా ఈ వృత్తులు ఎవరూ చేపట్టరు. అందులో సంపాదన బావుంటుందని చేసేవాళ్ళు కొందరు లేకపోలేదు.

రమణయ్యగారు—ఆ పట్నంలో చాలా కాలంగా అపర కర్మలు చేయించే వృత్తిలో ఉన్నాడు. ఆయన బోలెడు సంపాదించాడు. కొడుకులు బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఇహ తనకి చోటు లేదనుకున్నాక వృత్తిమానేశాడు. కాని—ఆ వృత్తిలో ఉన్న కారణంగా చాలా కాలంగా ఆయన కూతురికి పెళ్ళి కావడం లేదు. ఎంత కట్నం ఇస్తానన్నా ఎవరూ ముందుకు రాలేదు. సంబంధాల కోసం వెతికి, వెతికి చివరకి సుబ్బన్నకి తన కూతుర్నిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించాడు. అంతేకాదు—సుబ్బన్నని తిలదానాలు పట్టడం మానెయ్యమని, తను పెట్టుబడి పెట్టి వ్యాపారం చేయిస్తానని చెప్పాడు.


సుబ్బన్న పని తంతే నువ్వు చేనులో పడ్డట్టుగా అయింది.

సుబ్బన్న వివాహం జరిగింది.

మావగారి సలహా ప్రకారం వ్యాపారం పెట్టాడు. అతని పని మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది.

సంవత్సరం తిరిగే సరికి అతనికి పండంటి కొడుకు పుట్టాడు.

ఆ పిల్లాడు దోష నక్షత్రంలో పుట్టిన కారణంగా శాంతి చేయించాల్సివచ్చింది. వెంకట శాస్త్రి అన్ని ఏర్పాట్లు తను చూస్తానన్నాడు. తీరా తిలదానం ఇచ్చే సమయం వచ్చే సరికి సుబ్బన్న అవాక్కయిపోయాడు.




పీట మీద కూర్చున్న మనిషి—వీరన్నగారు. ఆయనకి మాట రాలేదు. కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"ఆ వేళ నీ పొట్ట కొట్టానురా—ఫలితం అనుభవిస్తున్నాను. మగపిల్లలిద్దరూ జూదరులై, వ్యభిచారులై ఆస్తంతా పాడు చేసారు. అలాంటి పిల్లలున్న తండ్రి పురోహితుడిగా పనికిరాడని—ఊరంతా కల్సి నిర్ణయించి మరొకర్ని తెచ్చుకున్నారు. బెంగతో నా పెళ్ళాం కాలం చేసింది.

ఒంటరి వాడినై—ఈ వెధవ పొట్టకి గుప్పెడు అన్నం మెతుకుల్లేక చివరికిలా—

శని రోజులు ఏం చేస్తాం! "భుజం మీద కండువాతో కళ్ళొత్తుకున్నాడు.

"బాధ పడకండి—మీరీ వృత్తి చెయ్యనక్కర్లేదు. మీరు బతికినంత కాలం మా ఇంట్లో ఉండండి. మీ కింత అన్నం పెట్టడం నాకు కష్టం కాదు.

శని ప్రభావమని, రాహువు ప్రభావమని, కేతువు వక్రంగా చూస్తున్నాడని మనం ఊరికే అనుకుంటాం. రాహువులు, కేతువులు, శనిగాళ్ళు—అలాగే సూర్యుళ్ళు, చంద్రుళ్ళు, కుజుళ్ళు మనలోనే — మన మనుషుల్లోనే ఉన్నారు. లేవండి—మీరీ దానం పట్టొద్దు" అన్నాడు సుబ్బన్న.

"నువ్వు సూర్యుడివిరా—" అందామనుకున్నాడు వీరన్నగారు—కాని ఆయనకి గొంతు పెగల్లేదు బాధతో, ఆనందంతో, అపరాధ భావంతో అది పూడుకుపోయింది."

అంకితం: అక్కయ్య స్మృతికి!

